


కిక్కిరిసిన మార్కెట్



కిటకిటలాడుతున్న ఎంజి రోడ్డు

దసరా నేపథ్యంలో నగరంలోని ప్రధాన మార్కెట్ ప్రాంతాలు కిటకిటలాడాయి. జిల్లాలోనే అతిపెద్దదైన పిడబ్ల్యు మార్కెట్, మున్సిపల్ కార్యాలయం వద్ద మార్కెట్, గంటస్తంభం, కన్యకా పరమేశ్వరి ఆలయం, ఎమ్‌జి రోడ్డు తదితర ప్రాంతాలు వేలాది మందితో కిక్కిరిసిపోయాయి. జిల్లా కేంద్ర ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు నిత్యాసర సరుకులు, పండ్లు, పూలు తదితర సామాగ్రి కోసం రావడంతో మార్కెట్ అంతా జనసంద్రంగా మారింది.

-ప్రజాశక్తి, విజయనగరంకోట

విజయనగరం ఉత్సవం
చూసొద్దాం రండి

సంగీత, సాంస్కృతిక, సాహిత్య నిలయమైన విజయనగరం సంబరాలకు సిద్ధమైంది. విజయనగర ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి జాతరకు అంగరంగ వైభవంగా ముస్తాబవుతోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాలో నిర్వహిస్తున్న మొట్టమొదటి ఉత్సవం కావడంతో అటు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికార యంత్రాంగం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి చేస్తున్న విజయనగరం ఉత్సవాలు స్థానిక సంప్రదాయం ఉట్టిపడేలా, సంస్కృతి వెల్లివిరిసేలా, విజయనగరం వైభవాన్ని చాటి చెప్పేలా విజ్ఞాన, వినోద కార్యక్రమాలతో సన్నద్ధం అవుతోంది. ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ ఉత్సవాల నిర్వహణపై పలుమార్లు సమీక్షలు చేసి పలు సూచనలు జారీ చేశారు.

- సంబరాలకు సర్వం సన్నద్ధం
- గతం కంటే వైవిధ్యంగా.. వినోద భరితంగా..
- మూడు రోజుల పాటు అలరించనున్న కార్యక్రమాలు



పైడితల్లమ్మ ఆలయం వద్ద ఘటాలతో భక్తులు



విద్యుత్తు కాంతులతో ధగధగలాడుతున్న గంటస్తంభం

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/కోట/టౌన్

విజయనగరం ఉత్సవాలను నగరంలో 12 వేదికల వద్ద నిర్వహిస్తున్నారు. ప్రతి వేదిక వద్ద అధికారుల కమిటీతోపాటు శాశ్వత సభ్యులను ఇన్‌చార్జులుగా నియమించారు. 13, 14 తేదీల్లో విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మ పండగలో భాగంగా 14న తొలేళ్ళు, 15న సిరిమానోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అమ్మవారి పండగ సందర్భంగా ఉత్సవ శోభ నగరం నలుమూలలా అలరించేలా స్వాగత ద్వారాలను, ప్రభుత్వ భవనాలపై, పార్క్ లలో, ప్రధాన కూడళ్ళ వద్ద మిరిమిట్లు గొలిపే లైటింగ్ ఏర్పాటు చేశారు. గతం కంటే భిన్నంగా, వైవిధ్యంగా, ప్రత్యేకంగా ఈ ఏడాది కార్యక్రమాలను రూపకల్పన చేశారు. కోట వెనుక భాగంలో పైడిమాంబ చరిత్రను, విజయనగర వైభవాన్ని లేజర్ షో లుగా ప్రదర్శించడం ఈ ఏడాదికి ప్రత్యేకం. రంజని శివరంజనికి ఎదురుగా కోట పై 13, 14 తేదీలలో సాయంత్రం 6 నుండి 9 గంటల వరకు లేజర్ షో ఉంటుంది. అంతే కాకుండా ప్రతి ఏడాది అయోధ్యా మైదానంలో మెగా ఈవెంట్ ఒక్క రోజే జరిగేది. ఈ ఏడాది 13 , 14 తేదీలలో రెండు రోజులు మెగా ఈవెంట్లను నిర్వహించడం విశేషం . 13 న హైపర్ ఆది బృందం జబర్దస్త్ స్కిట్స్‌తో పాటు కోల్‌కత్తా డ్యాన్సర్లతో బాల్ సర్సా ప్రదర్శన, ఇండియన్ ఐడల్ ఫేం సాయి ఆర్కెస్ట్రా తో వినోదాన్ని అందించనున్నారు. 14న ప్రముఖ గాయకులు కార్తీక్‌తో మెగా మ్యూజికల్ నైట్ నిర్వహిస్తున్నారు. 13న ఉదయం జరిగే ఉత్సవ ప్రారంభ సభకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, 14న సాయంత్రం జరిగే ముగింపు కార్యక్రమానికి హోం మంత్రి అనితతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారు.

2వేల మందితో పోలీసు బందోబస్తు

ఉత్సవాల సందర్భంగా 6 జిల్లాల నుండి 2 వేల మంది బందోబస్తు కోసం నియమించారు. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి బందోబస్తు పర్యవేక్షించే విధంగా 80 సి సి కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసారు. ఏరియల్ సర్వే , నిఘాకు మూడు డ్రోన్లను వినియోగిస్తున్నారు.



నగరంలోని ప్రధాన రహదారుల్లో లైట్ సెట్టింగ్



విద్యుత్తు కాంతులతో ధగధగలాడుతున్న కోట

- 13న ఉదయం 8 గంటలకు ఉత్సవర్యాలీ ప్రారంభం. పైడితల్లమ్మ ఆలయం నుంచి అయోధ్య మైదానం వరకు వివిధ కళారూపాలతో ర్యాలీ. 11గంటలకు అయోధ్య మైదానంలో ప్రారంభోత్సవ సభ. వివిధ వేదికల్లో నిర్వహించే ఉత్సవ కార్యక్రమాలివి...

విజయనగరం ఉత్సవ కార్యక్రమాలు

ఆనందగజపతి కళాక్షేత్రం

- 13, 14తేదీల్లో ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 6గంటల వరకు సాంస్కృతిక, శాస్త్రీయ సంగీత నృత్య కార్యక్రమాలు.

మహారాజా కోట

- 13,14తేదీల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సైన్స్‌ఫెయిర్, స్టాంప్స్‌అండ్ కాయిన్స్‌ఎగ్జిబిషన్,ఆర్ట్ గ్యాలరీ.

గురజాడ కళాభారతి

- ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఏకపాత్రాభినయాలు, నాటికలు ప్రదర్శన.
- విజయనగరం ప్రముఖుల, కార్గిల్ యుద్ధ వీరుల ఫొటో ఎగ్జిబిషన్

విజ్జి స్టేడియం

- 13,14తేదీల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, వాలీ బాల్, స్కేటింగ్ పోటీలు

ఎం.ఆర్.లేడీస్ రిక్రియేషన్ క్లబ్

- ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు భువన విజయం, శతాధిక కవి సమ్మేళనం, సాహితీ గోష్టి, సంగీత నవ అవధానం నిర్వహణ

లయన్స్ కమ్యూనిటీ హాలు

- ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు గిరిజన కళాకారులతో థింసా నృత్యాలు, కోలాటాలు, జానపద నృత్యాలు, విజయనగర వైభవం డాక్యుమెంటరీ ప్రదర్శన.

బొంకుల దిబ్బ (కోటకు ఎదురుగా)

- సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకు కన్యాశుల్కం, సత్య హరిశ్చంద్ర నాటకాల ప్రదర్శన

ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు కోట ఎదురుగా పులివేషాల ప్రదర్శన

అయోధ్య మైదానం

- 13న మధ్యాహ్నం 3 గంటల నుంచి పెట్ షో నిర్వహణ. సాయంత్రం 6గంటలకు జబర్దస్త్ హైపర్ ఆది కామెడీ ప్రదర్శన, బెంగాల్ బృందం నృత్య ప్రదర్శన, సాహితీ చాగంటి, సాయి చరణ్, అరుణ్ కౌండిన్య, దామిని భట్ల వారితో మ్యూజికల్ నైట్
- 14న సాయంత్రం 6 గంటల నుంచి ప్రముఖ సినీ, టివి, సినీ గాయకుడు కార్తీక్ మ్యూజిక్ షో.

రాజీవ్ క్రీడా మైదానం

- 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు హాట్ ఎయిర్ బెలూన్ నిర్వహణ

లోవర్ ట్యాంక్ బండ్ రోడ్

- 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జాతీయ స్థాయి డ్వాక్రా ఉత్పత్తుల (సరస్) మేళా నిర్వహణ.
- 13,14 తేదీల్లో ఉదయం 10గంటల నుంచి రాత్రి 10గంటల వరకు పుష్ప ఫల ప్రదర్శన.
- సాయంత్ర 6గంటల నుంచి రాత్రి 9గంటల వరకు కోటపై (రంజని, శివరంజని థియేటర్ ఎదురుగా) లేజర్ షో నిర్వహణ.

ఫోర్టుసిటీ వెనుక భాగంలో 12వ తేదీ నుంచి 16వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు పారా మోటరింగ్ నిర్వహణ.

ఎంఎస్‌ఎంఇ పార్కుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

రాష్ట్రంలోని మహిళా స్వయం సహాయక సంఘాలతో చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయించాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా జిల్లా కేంద్రంలో ఎంఎస్‌ఎంఇ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ఎంఎస్‌ఎమ్‌ఇ సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని విజయనగరం రూరల్ మండలం గోపాలపురం వద్ద అందుబాటులో ఉన్న 15 ఎకరాల స్థలంలో స్వయం సహాయక సంఘాల ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటు కోసం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ఎమ్మెల్యే అదితి గజపతి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. గోపాలపురం వద్ద 19.5 ఎకరాల స్థలం అందుబాటులో ఉండగా ఇందులో ఐదు ఎకరాలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం కేటాయించారని, మిగతా 14.5 ఎకరాల స్థలంలో ఎంఎస్‌ఎంఇ పార్క్ ఏర్పాటు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. స్థలాన్ని కేటాయిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ పర్యటనలో సెర్ప్ సిఇఒ జి.వీరపాండ్యన్ జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్, ఆర్డీవో దాట్ల కీర్తి, తహశీల్దార్ కూర్మనాథరావు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాల పంట

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారులు పతకాల పంట పండించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఈ నెల 6 నుంచి 16 వరకు జరుగుతున్న జాతీయ స్థాయి యూత్, జూనియర్, సబ్ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పలు పతకాలు సాధించారు. 55 కిలోల జూనియర్ విభాగంలో ఎస్.గురునాయుడు.. స్నాచ్ 105, క్లీన్ జర్క్ 130... మొత్తం 235 కిలోల బరువెత్తి రజతం సాధించాడు. బి.భార్గవి సబ్ జూనియర్ 49 కిలోల విభాగంలో శ్నాచ్ 68, క్లీన్ జర్క్ 86.. మొత్తం 154కిలోల బరువెత్తి కాంస్యం సాధించింది. బి.చంద్రిక జూనియర్ 49 కిలోల విభాగంలో స్నాచ్ 71, క్లీన్ జర్క్ 92... మొత్తం 163 కిలోల బరువెత్తి సిల్వర్ మెడల్ కైవశం చేసుకున్నాడు. బి.హారిక సబ్ జూనియర్ 64 కిలోల విభాగంలో స్నాచ్ 78, క్లీన్ జర్క్ 101.. మొత్తం 179 కిలోల బరువెత్తి రజత పతకం పొందింది. కె.దినేష్ కుమార్ సబ్ జూనియర్ 68 కిలోల విభాగంలో స్నాచ్ 117, క్లీన్ జర్క్ 138.. మొత్తం 255కిలోలు బరువెత్తి కాంస్య పతకం సాధించాడు. కె.అనిల్ కుమార్ జూనియర్ 73 కిలోల విభాగంలో స్నాచ్ 117, క్లీన్ జర్క్ 156.. మొత్తం 274 కిలోల బరువెత్తి కాంస్య పతకం సాధించాడు. వీరిని జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బెల్లాన లక్ష్మీనరేంద్ర, కార్యదర్శి, కోచ్ చల్లా రాము, బడేటి వెంకట్రామయ్య, కోచ్ వల్లూరి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, మధు అభినందించారు.

అనధికార లే అవుట్ గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని ప్రదీప్‌నగర్ సమీపాన అనధికారంగా వేసిన లే అవుట్‌లో కార్పొరేషన్ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మానవ హక్కుల కార్యకర్త, న్యాయవాది పైల రమేష్‌రాజు చేసిన ఫిర్యాదు మేరకు ధర్మపురి సర్వే నెంబరు 63/2లో ఉన్న అచ్చుతాం నగర్ లే అవుట్‌ను అనధికారిక లే అవుట్‌గా గుర్తిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్‌లో ఎవరూ ప్లాట్లు కొనవద్దని అధికారులు పేర్కొన్నారు.

జెడ్‌పి చైర్మన్ విజయదశమి శుభాకాంక్షలు

విజయనగరంటౌన్ : చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండగ మన అందరి జీవితాల్లో సుఖ సంతోషాలను నింపాలని జిల్లా పరిషత్ చైర్పర్సన్ మజ్జి శ్రీనివాసరావు ఆకాంక్షించారు. దసరా పండుగ సందర్భంగా ఉమ్మడి జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మహిషాసురుని వధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే విజయదశమి పండుగ మనందరికీ ఆనందాన్ని అందించాలని కోరారు.

కలెక్టర్ అంబేద్కర్ దసరా శుభాకాంక్షలు

విజయనగరంకోట : కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి జిల్లా ప్రజలందరికీ అన్ని విధాలా శుభాన్ని కలుగజేయాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి విజయానికి ప్రతీకగా దసరా పండగ జరుపుకుంటారని, అందరికీ విజయాన్ని కలుగుజేయాలని కోరారు.

రైతుబజారులో రాయితీతో ఆయిల్, టమోటా

ప్రజాశక్తి-విజయనగరంకోట

ప్రభుత్వ ఆదేశాల మేరకు తగ్గింపు ధరల్లో నిత్యావసర సరకుల విక్రయాన్ని రాష్ట్ర ఎంఎస్‌ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్థానిక ఆర్అండ్‌బి రైతుబజార్‌లో శుక్రవారం ప్రారంభించారు. దీనిలో భాగంగా పామాయిల్ ప్యాకెట్‌ను(850 గ్రాములు) రూ.110 చొప్పున, సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌ను(910 గ్రాములు) రూ.124చొప్పున వినియోగ దారులకు అందజేశారు. కిలో రూ.45 చొప్పున టమాట పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోనే ఉన్నాయని, దీనికోసం ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.కార్యక్రమంలో ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎమ్‌డి వీరపాండ్యన్, కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఎస్‌ఒ మధుసూదనరావు, సివిల్ సప్లై డిఎం మీనాకుమారి, మార్కెటింగ్ ఎడి బి.రవికుమార్ పాల్గొన్నారు.



నూనె ప్యాకెట్లను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపి, ఎమ్మెల్యే

బాలికలకు భరోసానిద్దాం

- కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం



ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బాలికలకు సామాజికంగా, ఆర్థికంగా, మానసికంగా భరోసానివ్వాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పిలుపునిచ్చారు. జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఆర్అండ్‌బి జంక్షన్ నుంచి పోలీస్ బేరెక్స్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మానవహారాన్ని నిర్వహించి, బాలికల సంరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ, బాలికలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని చెప్పారు. వారికి మంచి భవిష్యత్తును కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా బాలికలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆడపిల్లల భద్రత... అందరి బాధ్యత

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. వారిపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రతీఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలికలకు రక్షణ కల్పించడంతోపాటు వారికి చక్కని చదువు, ఆరోగ్యం అందించాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాలల హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షురాలు హిమబిందు, ఐసిడిఎస్ పీడీ బి.శాంతకుమారి, సిడిపిఒలు, డిసిపియు, వన్ స్టాప్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంప్రదాయ బద్ధంగా సిరిమానోత్సవం

ప్రజాశక్తి-విజయనగరంకోట

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అమ్మవారి పండగ ఏర్పాట్ల పై సంబందిత అధికారులతో శుక్రవారం తన ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి సిరిమానోత్సవాన్ని 15 వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకే ఖచ్చితంగా ప్రారంభించాలని, 5 గంటల కు పూర్తి చేయాలనీ ఆదేశించారు. సిరిమాను వద్ద పని చేసే సిబ్బంది అందరూ నిర్ణీత సమయానికి సిరిమాను ప్రారంభం అయ్యేలా ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అటవీ శాఖాధికారులు, ఆర్‌డిఒలు దగ్గరే ఉండి పర్యవేక్షించాలన్నారు. తొక్కిసలాట జరగకుండా సిరిమాను వద్ద అందుకు సంబంధించిన వారు తప్ప ఇతరులు లేకుండా రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అమ్మవారి దర్శనాలకు మంత్రులు స్థాయి విఐపి లు వచ్చేటప్పుడు తప్ప సాధారణ భక్తులకు ఇబ్బంది కలిగేలా క్యు లైన్లను నిలుపుదల చేయవద్దని, అందరికీ త్వరగా దర్శనం అయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్‌ఒ అనిత, ఆర్‌డిఒ కీర్తి, డిఎస్‌పి శ్రీనివాస రావు, ఇఒ ప్రసాద రావు, ఆర్అండ్‌బి ఎస్‌ఇ కాంతిమతి , మన్సాస్ ఇఒ, పైడితల్లి అమ్మవారి ప్రధాన పూజారి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ డిఎస్‌సిలో
'విజేత' విద్యార్థులకు ర్యాంకుల పంట

ప్రజాశక్తి-రాజాం

తెలంగాణ డిఎస్‌సిలో రాజాం విజేత కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రభంజనం సష్టించారు. అప్పలరాజు మాస్టార్ ఆధ్వర్యంలో అతి తక్కువ ఫీజుతో శిక్షణ పొందిన విద్యార్థులు చిన్న వయస్సులోనే ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు. అయితే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి శిక్షణ ఇవ్వడమే విజేత కోచింగ్ సెంటర్ ముఖ్య ఉద్దేశం. ఇక్కడ శిక్షణ పొందిన అభ్యర్థులు తెలంగాణ ఫలితాల్లో 4,8,9,13,15 ర్యాంకులు సాధించారు. కె. స్వప్న 4వ ర్యాంక్, కె. నీలవేణి 8వ ర్యాంక్, పి.హిమశ్రీ 9వ ర్యాంక్, వి.దివ్య 13వ ర్యాంక్, జ్యోత్స్న 15వ ర్యాంకు పొందారు. ఎపి డిఎస్‌సిలో కూడా ఇదే విధంగా ర్యాంక్ లు సాధించేలా శిక్షణ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఎంపికైన నూతన ఉపాధ్యాయులుకు కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అభినందనలు తెలిపారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక చర్యలను విడనాడ కుంటే రానున్న రోజులలో పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో నిర్వహించిన సిపిఎం శాఖ మహాసభలో తమ్మినేని సూర్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పాలక పార్టీలు ఎన్నికల వరకే ప్రజలను వాడుకుని తర్వాత ప్రజా సమస్యలను గాలికి వదిలేస్తున్నారని అన్నారు. బొడ్డవర వద్ద జిందాల్ అల్యూమినియం కంపెనీ వస్తే ఉద్యోగాలు వస్తాయని బొత్స సత్యనారాయణ, రఘురాజు చెప్పిన మాటలు నమ్మి కంపెనీకి భూములిచ్చిన రైతులు మోసపోయారని, నాయకులు డబ్బులు బాగా సంపాదించుకొని లాభపడ్డారని అన్నారు. సిపిఎం పోరాట ఫలితంగా సాధించిన ఉపాధి హామీని నీరు గారుస్తున్నారని అన్నారు. కొత్తూరులో ఎస్సీ కాలనీని సిపిఎం పోరాటాలతోనే సాధించుకున్నామనిచ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. కొత్తూరు శాఖా కార్యదర్శిగా ఎర్రాప్రగడ భాస్కర్ రావు, శృంగవరపుకోట శాఖా కార్యదర్శి చెలికాని ముత్యాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ, రామ్మోహన్, చెలికాని ముత్యాలు, భాస్కరరావు, శంకర్, క్వారీ కార్మికులు పాల్గొన్నారు.

సర్కారుకు కాసుల గళగళ

- 153 షాపులకు 5237 దరఖాస్తులు
- జిల్లా నుంచే వంద కోట్లకు పైగా ఆదాయం
- ఒక్కో షాపునకు సరాసరి 34 .22 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మద్యం దుకాణాల దరఖాస్తుల స్వీకరణలో ప్రభుత్వ ఖజానాలో కాసులు గళగళలాడాయి. ఊహకు అందని రీతిలో 104కోట్ల 74లక్షల ఆదాయం సమకూరింది. లాటరీ అనంతరం దుకాణాల ఏర్పాటు సమయంలోనూ, ప్రతి ఆరు నెలలకోసారి లైసెన్సుల రూపంలోనూ పదిరెట్లకుపైగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈనెల 1వ తేదీన మద్యం దుకాణాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. జిల్లాలో మొత్తంగా 153 షాపులకు గాను శుక్రవారం రాత్రి 7గంటల సమయానికి జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 5,327 దరఖాస్తులు అందాయి. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ రాత్రి 12గంటల వరకు కొనసాగింది. దీంతో, దరఖాస్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఆఖరి రోజు కావడంతో శుక్రవారం ఒక్కరోజే వెయ్యికిపైగా దరఖాస్తులు అందినట్టు సమాచారం. శని, ఆదివారాల్లో ఈ దరఖాస్తులను పరిశీలించనున్నారు. దరఖాస్తు ఒక్కంటికీ రూ.2లక్షల చొప్పున 5,237 దరఖాస్తుల ద్వారా 104కోట్ల, 74లక్షల ఆదాయం సమకూరినట్టే. సిండికేట్ వ్యవహారాలు నడవకపోతే ఇంకా ఎక్కువ ఆదాయం సమకూరేదని పలువురు విశ్లేషిస్తున్నారు. ఎక్కువ దరఖాస్తులు అందిన జిల్లాల్లో మన జిల్లా ఐదో స్థానంలో నిలవడం గమనార్హం. చివరికి విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల కన్నా విజయనగరంలోనే ఎక్కువ దరఖాస్తులు అందాయి. ఒక్కో దుకాణానికి సరాసరి 34.22 దరఖాస్తులు అందినట్టు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఆదాయమే లక్ష్యంగా మద్యం దుకాణాల దరఖాస్తు ఫీజులు, లైసెన్సు రుసుములు ఉన్నాయని, లైసెన్సుల రూపంలో ఇంకా ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరనుందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈనెల 14న లాటరీ తీస్తామని ఎక్సైజ్ అధికారులు ముందుగానే ప్రకటించిన సంగతి విధితమే. లాటరీ స్థలంగా ప్రకటించిన ఆనందగజపతి ఆడిటోరియంలో విజయనగరం ఉత్సవాల హడావుడి ఉన్న నేపథ్యంలో ఎస్‌విఎన్ నగర్ సుజాత ఫంక్షన్ హాల్‌లో లాటరీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ రోజు ఉదయం 8గంటల నుంచి దుకాణాలవారీగా లాటరీ తీయడం మొదలవుతంది. ఈనేపథ్యంలో ఆరోజు 7గంటలకే దరఖాస్తుదారులంతా అక్కడికి చేరుకోవాల్సివుంటుందని ఎక్సైజ్ డిసి బాబ్జీరావు ప్రజాశక్తికి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 52 షాపులకు 1376 దరఖాస్తులు వచ్చాయి. ఆ జిల్లా నుంచి రూ.27కోట్ల 52లక్షలు ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది.



జనంతో కిటకిటలాడుతున్న మార్కెట్ రోడ్డు

జనంతో మార్కెట్ కిటకిట

ప్రజాశక్తి-బొబ్బిలి

దసరా సామాగ్రి కొనుగోలు చేసేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు చేరుకోవడంతో బొబ్బిలి మార్కెట్ శుక్రవారం కిటకిటలాడింది. మార్కెట్ రోడ్డు కిక్కిరిసి ఉండడంతో ట్రాఫిక్ స్తంభించింది. ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు మార్కెట్ రోడ్డుకు చేరుకుని ఆటోలు, కార్లు రాకుండా అడ్డుకున్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రజలు దసరా సామాన్లు కొనుగోలు చేసుకున్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇన్‌ఛార్జి పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో కాంగ్రెస్ జిల్లా ఇన్చార్జి ఉమాశంకర్ (అయ్యప్ప) శుక్రవారం పర్యటించారు. డిసిసి అధ్యక్షులు విద్యాసాగర్ తో కలిసి ఎస్కోట, చీపురుపల్లి, విజయనగరం, ఎస్.కోట నియోజకవర్గాల్లో పర్యటించిన ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. జిల్లాలో నూతన కార్యవర్గం ఏర్పాటుపై పిసిసి అధ్యక్షులు షర్మిల ఆదేశాలు ప్రకారం ఆయన జిల్లాకు వచ్చినట్లు డిసిసి అధ్యక్షులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నందున కాంగ్రెస్ శ్రేణులను సిద్ధం చేయనున్నట్లు ఉమాశంకర్ తెలిపారు. కార్యక్రమంలో డిసిసి మాజీ అధ్యక్షులు రమేష్, విజయనగరం పట్టణ మాజీ అధ్యక్షుడు సతీష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విజయనగరం ఉత్సవాలకు 'అంతర్యామి'

ప్రజాశక్తి-బొబ్బిలి

ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే విజయనగరం ఉత్సవాల్లో ఏకపాత్రాభినయం, సాంఘిక, పౌరాణిక నాటికల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. పౌరాణిక విభాగంలో బొబ్బిలికి చెందిన ఆనందోబ్రహ్మ అకాడమీ వారి 'అంతర్యామి' పౌరాణిక ఘట్టం ఎంపికైంది. ఈ నెల 14న సాయంత్రం విజయనగరంలోని గురజాడ కళాభారతిలో అంతర్యామి ప్రదర్శించాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందినట్లు దర్శకుడు ఎం.విజయమోహన్ రావు తెలిపారు. విజయనగరం ఉత్సవాలకు 'అంతర్యామి' ఎంపిక పట్ల శ్రీకళాభారతి, ఆనందోబ్రహ్మ, రచన సమాఖ్య, యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్, బొబ్బిలి ఫిలిం సొసైటీ, గాంధీ స్మారక నిధి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

సురవరంలో గ్రామదర్శిని

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని సురవరంలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్వాడీ సెంటర్, సచివాలయాన్ని డిఎల్‌డిఎ హేమసుందరరావు సందర్శించారు. గ్రామస్తుల నుంచి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్ కుమార్, రఘునాథాచారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ దేవి

విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని పాటూరు గ్రామంలో, బొద్దాం నాలుగు రోడ్ల కూడలి, వల్లంపూడి ప్రధాన రహదారిపై శుక్రవారం ఎస్ఐ బి.దేవి ఆధ్వర్యాన పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నివారణ, ఇసుక, కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న బంగార్రాజు

సారిపల్లిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లిలో కాష్వి హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసారి గ్రామానికి వచ్చిన బంగార్రాజుకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కాష్వి హాస్పిటల్ ఎమ్‌డి మోపాడ ప్రవీణ్ కుమార్, సిబ్బంది ప్రజలకు సేవలందించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, కార్యదర్శి లంక అప్పలనాయుడు, అల్తి శ్రీను, వెంకటరావు, బాబూరావు, గోపి, తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్

ప్రజాశక్తి-డెంకాడ

ప్రమాదం బారిన పడి మరణించిన కార్యకర్తలకు టిడిపి అండగా ఉంటుందని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు పతివాడ అప్పలనారాయణ తెలిపారు. మండలంలోని నాతవలస గ్రామానికి చెందిన గేదెల ప్రవీణ్ కుమార్ గతేడాది డిసెంబర్ 24న రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ప్రవీణ్ టిడిపి సభ్యత్వం తీసుకోవడంతో ఆ బీమా సొమ్ము రూ.2 లక్షల చెక్కును శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన భార్య గంగకు అందజేశారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు ప్రతిఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలని వారు కోరారు. ఇకనుంచి సభ్యత్వం తీసుకున్న వ్యక్తి ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు బీమా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పల్లె భాస్కరరావు, నాయకులు ఆవాల సోమశేఖర్ బమ్మిడి రమేష్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని పాలవలసలో శుక్రవారం బొలేరో వాహనం ఢీకొని చింతల షణ్ముఖ (5) మృతి చెందాడు. ఉపాధి కోసం విశాఖలో ఉంటున్న చింతల ఈశ్వరరావు కుమారుడు షణ్ముఖ దసరా సెలవులు రావడంతో తాతగారి ఇంటికి వచ్చాడు. కల్లం వద్ద ఆడుకుంటుండగా వాహనం ఢీకొంది. బలమైన గాయాలు కావడంతో విజయనగరంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బాలుడు మృతి చెందాడు తండ్రి ఈశ్వర రావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఐ.నారాయణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాలకు భారీగా ఏర్పాట్లు

- రెండు రోజులూ మెగా మ్యూజికల్ నైట్‌లు
- హాట్ ఎయిర్ బెలూన్ అదనపు ఆకర్షణ : మంత్రి కొండపల్లి
- కలెక్టర్‌తో కలిసి ఉత్సవ వేదికల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా కేంద్రంలో రెండురోజుల పాటు అక్టోబరు 13, 14 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విజయనగరం ఉత్సవాల కోసం జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో జిల్లా అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తదితరులతో కలసి శుక్రవారం పలు వేదికలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా వేదికల వద్ద చేస్తున్న ఏర్పాట్లపై ఇన్‌చార్జి అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఉత్సవ ప్రారంభ ముగింపు కార్యక్రమాలకు రాష్ట్ర స్థాయి ప్రముఖులు, మంత్రులు తదితరులు హాజరు కానున్నందున లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. 13న ఉదయం జరిగే ఉత్సవ ప్రారంభ సభకు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, 14న సాయంత్రం జరిగే ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి అనిత ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని, హోంశాఖా మంత్రితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఆరోజు హాజరు కానున్నట్టు చెప్పారు. అనంతరం మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ డా.అంబేద్కర్ తదితరులు కోట ప్రాంతంలో పర్యటించి అక్కడ జరుగుతున్న కోట సుందరీకరణ పనులను పరిశీలించారు. శనివారం నాటికల్లా లేజర్ షో వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తికావాలని అక్కడ పనులు నిర్వహిస్తున్న వారిని ఆదేశించారు.



ఏర్పాట్లను మంత్రి శ్రీనివాస్‌కి వివరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

రాజీవ్ క్రీడా ప్రాంగణంలో హాట్ ఎయిర్ బెలూన్ షో

ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది హాట్ ఎయిర్ బెలూన్, పారామోటారింగ్ తదితర సాహస ఈవెంట్లు యువత కోసం ఏర్పాటు చేశామని, యువత వీటిలో పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. యువత ఉత్సాహంగా వీటిలో పాల్గొనేందుకు వీలుగా హాట్ ఎయిర్ బెలూన్ కు టిక్కెట్ ధరను రూ.3000 నుంచి రూ.2000 కు తగ్గించామని,పిల్లలకు రూ.1500 మాత్రమే వసూలు చేయనున్నట్టు పేర్కొన్నారు. 12వ తేదీ ఉదయం నుంచే హాట్ ఎయిర్ బెలూన్ షో ప్రారంభమవుతుందని, అందరూ ఈ సాహస క్రీడలో పాల్గొని ఇక్కడ లభిస్తున్న అరుదైన అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. పోర్ట్ సిటీ స్కూలు వెనుకభాగంలో పారామోటారింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకుడు సుధాకర్ తెలిపారు. రూ.3వేలు టిక్కెట్ ధరగా నిర్ణయించినట్టు చెప్పారు. ఒక రైడ్‌లో ఒకరినే తీసుకువెళ్లనున్నట్టు చెప్పారు. వెయ్యి అడుగుల ఎత్తు వరకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.



బొబ్బిలి.. ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న రోటరీ క్లబ్ చైర్మన్ జెసి రాజు



వేపాడ.. ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

దేశ భవిష్యత్తు బాలికలదే

ప్రజాశక్తి-బొబ్బిలి

దేశ భవిష్యత్తు బాలికలదేనని, బాలికలు భావి భారత దీపికలని రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షులు జెసి రాజు తెలిపారు. శుక్రవారం ప్రపంచ బాలికా దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆడబిడ్డను కాపాడుకుందాం అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. తాండ్ర పాపారాయ కూడలిలో బ్యానర్‌ను ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఆడపిల్లల హక్కులు, నిత్యజీవితంలో వారు ఎదుర్కొంటున్న సవాళ్లు, సమస్యలు గురించి చర్చించి తగు చర్యలు తీసుకొనేందుకు ఏటా ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. భవిష్యత్ వైపు బాలికల చూపు అనే నినాదంతో ఈ ఏడాది బాలికా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బాలికలకు సాధికారతతోపాటు సమానత్వ సాధనకు ఈ నినాదం ప్రోత్సహిస్తుందని చెప్పారు. బాలికల సాధికారత కోసం వారి ఆరోగ్యం, పోషకాహారం, చదువు, హింస నుంచి, లైంగిక దోపిడీ నుండి రక్షణ, భద్రత, స్వేచ్ఛ వీటిపై ప్రభుత్వాలు, సమాజం, సంస్థలు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాల్య వివాహాలను ఏ దశలోనూ ప్రోత్సహించకూడదని చెప్పారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. బాలికల హక్కుల పరిరక్షణ కుటుంబం నుండే ప్రారంభం కావాలన్నారు. చదువుకొనే స్వేచ్ఛ, నాణ్యమైన విద్య ,నైపుణ్యాలు బాలికలకు అందుబాటులో ఉన్నప్పుడే బాలికల భవిష్యత్తు అభివృద్ధి పథంలో చూడగలమని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ గెంబలి శ్రీనివాసరావు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కె.రామకృష్ణ, కృష్ణమోహన్, శివకాంత్, హమీద్, ఎం.ప్రసాద్, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : ఎస్.కె.ఆర్.పురం, వేపాడలో అంగన్వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు.

16 తరాల నుంచి ఆయుధపూజ

ప్రజాశక్తి-బొబ్బిలి

తమ కుటుంబం 16 తరాల నుంచి ఆయుధ పూజ చేస్తున్నట్లు బొబ్బిలి రాజ వంశీయులు సుజయకృష్ణ రంగారావు, బేబినాయన తెలిపారు. దసరా సందర్భంగా శుక్రవారం బొబ్బిలి కోటలో అంగరంగ వైభవంగా ఆయుధపూజ చేశారు. రాజుల పరిపాలనలో వినియోగించిన బంగారు సింహాసనాన్ని కోటలో తమ నివాసం నుంచి దర్బార్‌మహల్ వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సింహాసనానికి, యుద్ధంలో వినియోగించిన ఆయుధాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం ప్రకారం ఆయుధ పూజ చేస్తున్నామని చెప్పారు. ఆయుధ పూజను డిఎస్‌పి శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ సిఐలు సతీష్ కుమార్, నారాయణరావు, నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు హాజరై తిలకించారు.



ఆయుధపూజలో పాల్గొన్న సుజయ్‌కృష్ణ, బేబినాయన

సైబర్ నేరాలపై ఉక్కుపాదం

మాదక ద్రవ్యాల వ్యాపారాలు సాగనీయం ● 'ప్రజాశక్తి'తో బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు

ప్రజాశక్తి- రామభద్రపురం



సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతామని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు తెలిపారు. గంజాయి, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల రవాణా, వ్యాపారాలు సాగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. దొంగతనాలు, మద్యం అక్రమ అమ్మకాలు వంటి చీకటి వ్యాపారాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు. సిఐగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సర్కిల్ పరిధిలో నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల గురించి ఆయన 'ప్రజాశక్తి'కి ప్రత్యేకంగా వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

మాదక ద్రవ్యాల రవాణా అరికడతాం

ఒడిశా నుంచి రామభద్రపురం మీదుగా గంజాయి, మాదక ద్రవ్యాల రవాణా ఎక్కువగా జరుగుతున్నట్లు గుర్తించి, ప్రత్యేక నిఘా పెట్టాం. కొట్టక్కి జాతీయ రహదారి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశాం. ఇటీవల చాలామంది యువత గంజాయికి బానిస అవుతున్నారు వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. ఇంకా తెగబడి మాదక ద్రవ్యాల వైపు ఆకర్షితులై పట్టుబడితే కేసులు నమోదు చేస్తున్నాం. ఎస్‌పి సూచనల మేరకు 'సంకల్పం' పేరిట మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

ట్రాఫిక్ నియంత్రణకు కృషి

సర్కిల్ పరిధిలో ఉన్న మండలాల్లో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి నియంత్రణకు కృషి చేస్తున్నాం. ముఖ్యంగా రామభద్రపురంలో అంతర్జాతీయ కూరగాయల మార్కెట్, ఆర్‌టిసి కాంప్లెక్స్, వివిధ వాణిజ్య సముదాయాలు, రహదారి ఆక్రమణలు ఎక్కువగా ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ ఇబ్బందిగా ఉంది. పారాది వంతెన మరమ్మతులకు గురికావడంతో భారీ వాహనాలు బాడంగి, తెర్లాం మండలాల మీదుగా మళ్లించడం వల్ల ఆయా మండలాలతోపాటు బొబ్బిలి పట్టణంలో కూడా తరచూ ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ఇటీవల అన్ని ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నాం. చాలామంది ఆన్‌లైన్‌లో వస్తున్న యాప్‌ల బారిన పడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. వీటి బారిన పడకుండా ఉండేలా అవగాహన కల్పిస్తున్నాం. సెల్‌ఫోన్లకు వచ్చే సందేశాలపై అప్రమత్తంగా ఉండాలి. అత్యాశకు పోతే కష్టాలు తప్పవు.

మహిళలను వేధిస్తే కఠిన శిక్షలు

మహిళలు, చిన్నపిల్లల సంరక్షణకు పెద్దపీట వేస్తున్నాం. వీరిపై అఘాయిత్యాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఈవ్ టీజింగ్, ఉమెన్ ట్రాఫికింగ్‌పై కూడా నిఘా ఉంచాం.

దొంగతనాలపై గస్తీ ముమ్మరం

సర్కిల్ పరిధిలో అన్ని గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా గస్తీ ముమ్మరం చేస్తున్నాం. రాత్రి బీట్లు వేస్తున్నాం, అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచాం.

రహదారి భద్రతకు సహకరించాలి

ప్రజలంతా రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలి. హెల్మెట్, సీటు బెల్టు ధరించాలి. వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు ఉంచుకోవాలి. మైనర్లకు వాహనం ఇవ్వరాదు. వీటిపై ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం. డిజె సౌండ్స్ నిషేధం. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు చేపడితే చర్యలు తప్పవు.

సాఫ్ట్‌బాల్‌లో పారాది క్రీడాకారుల ప్రతిభ

ప్రజాశక్తి-బొబ్బిలి

కర్నూలు జిల్లాలో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పారాది జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. బాలుర విభాగంలో వేణు, జశ్వంత్ మూడో స్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో సుప్రియ, తేజస్విని, చైతన్యకుమారి ఎనిమిదో స్థానం సాధించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎమ్మెల్యే బేబినాయన అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.సాయిరమేష్, కార్యదర్శి రమేష్, పీడీ వెంకటనాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే లలితకుమారి, రాంప్రసాద్‌కు వినతి అందిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఎన్నికల్లో సహకరించండి

ఎమ్మెల్యే కోళ్లను కోరిన ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-కొత్తవలస

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకారం అందించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ కోరారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని ఆమె క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఘువర్మ మాట్లాడుతూ 2025 మార్చిలో జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎపిటిఎఫ్ తనను బలపరిచిందని తెలిపారు. టిడిపి మద్దతు తెలిపి, గెలుపునకు సహకరించాలని ఆమెకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కెబిఎ రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బొబ్బిలి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మెట్టవలస గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త వై.వాసుకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి ఆర్థిక సహాయం చేశారు. రాజాం కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాసును శుక్రవారం అప్పలస్వామి పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆయనతో జనసేన నాయకులు ఎ.నాగు, హరి, ప్రసాద్, దనుంజయ్ ఉన్నారు.

రతన్ టాటాకు డివిజి నివాళి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భారతీయ పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా మరణం దేశానికి తీరని లోటు అని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పేర్కొన్నారు. ప్రతిష్టాత్మక పరిశ్రమలకు అధిపతి లానే కాకుండా, ఉన్నతమైన వ్యక్తిత్వం, విలువలు, సామాజిక దృక్పథం ఉన్న వ్యక్తిగా ఆయన సమకాలీన ప్రపంచంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. తమ లాభాల్లో 60 శాతానికి పైగా తిరిగి సమాజానికే ఖర్చు చెయ్యడం టాటా గ్రూపు సంస్థల గొప్ప తనం. కరోనా విపత్కర పరిస్థితుల్లో వారు చిత్త శుద్ధి తో ఆ సంస్థల ఉద్యోగుల సంరక్షణ చేపట్టడం మాత్రమే కాకుండా, సామాజిక బాధ్యత కూడా తీసుకున్నారని తెలిపారు. రతన్ టాటా వ్యక్తిగతంగా ఎంత గొప్పవాడో, సున్నిత మనస్కుడో, సమాజం పట్ల బాధ్యత చూపిన వాడో ఆయనకు నివాళిగా వస్తున్న కథనాల్లో మరొక్క సారి తెలుస్తోందని తెలిపారు. దేశం గర్వించదగ్గ ఆ మహా వ్యక్తి అత్యున్నత పురస్కారం 'భారత రత్న' కు అన్ని విధాలా అర్హులని ఆయన పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బాడంగి



మృతిచెందిన రామారావు

పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని వీరసాగరం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ తారకేశ్వరరావు కథనం ప్రకారం...

బొబ్బిలికి చెందిన చప్ప రామారావు (42)కు భార్య గంగ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం మండలంలోని వీరసాగరంలో ఉన్న గంగ కన్నవారింటికి వచ్చారు. రామారావు మద్యం తాగి, గొడవపడటంతో గంగ మందలించింది. దీంతో రాత్రి 8 గంటల సమయంలో రామారావు బయటకు వెళ్లి పురుగుల మందు తాగాడు. గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వెంటనే వైద్యం కోసం బాడంగి సిహెచ్‌సికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్య కోసం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం రామారావు మరణించాడు. ఆయన భార్య గంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గంజాయి తాగుతూ ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని నాతవలస టోల్ గేటు సమీపంలోని చెరువుగట్టు వద్ద గంజాయి తాగుతున్న ముగ్గురు యువకులను డెంకాడ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుండి 200 గ్రాముల గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు సీజ్‌చేశారు. ముందస్తు సమాచారంతో డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు, సిబ్బంది దాడిచేశారు. విశాఖకు చెందిన గంటా చిరంజీవి, గోరిజిలి డానియల్ రాజ్, చిన్ని సుమంత్‌ను అరెస్టుచేశారు. నిందితులు మద్యం, గంజాయి సేవించుటకు అలవాటు పడినట్లు పోలీసులు తెలిపారు. విశాఖపట్నం నుండి చింతపల్లి బీచ్‌కు వెళ్లే క్రమంలో నాతవలస టోల్ గేటుకు సమీపంలోని చెరువు గట్టుపై గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితులకు గంజాయి సరఫరా చేసిన వారి సమాచారం రాబట్టామని, ఆ వ్యక్తిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ఈ కేసులో క్రియాశీలకంగా పని చేసిన భోగాపురం సిఐ జి.రామకృష్ణ, డెంకాడ ఎస్ఐ సన్యాసి నాయుడు, ఇతర పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-బొండపల్లి

గొట్లాంలో బంగారు దుకాణంలో సెప్టెంబర్ 14న రాత్రి జరిగిన చోరీ కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి అరకిలో వెండి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం బొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి శ్రీనివాసరావు విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసి, వివరాలు వెల్లడించారు. డిఎస్‌పి కథనం ప్రకారం...

గొట్లాంలోని శ్రీ సిద్ధివినాయక జువెలరీ షాప్‌లో సెప్టెంబర్ 14న రాత్రి పది కేజీల వెండి ఆభరణాలు, సుమారు తులమున్నర బంగారం పోయిందని షాపు యజమాని తాళ్లపూడి సత్తిబాబు బొండపల్లి పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎస్ఐ యు.మహేష్, సిసిఎస్ ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యాన క్లూస్ టీమ్ దొంగతనానికి పాల్పడిన వారి వేలిముద్రలను సేకరించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం నెలివాడ గ్రామ సముదాయం వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ కేసులో దొరికిన వేలిముద్రలు వారితో సరిపోయాయి. వారు మధ్యప్రదేశ్‌కు చెందిన అజయ్ పార్ది, సుల్తాన్ మొగియా పార్దిగా గుర్తించారు. వీరి వద్ద నుండి సుమారు అరకిలో వెండి వస్తువులు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి వివేక పార్ది, చరం పార్ది, పురం పార్ది, సచిన్ పార్దితోపాటు దొంగతనానికి ప్రోత్సహించిన మరో వ్యక్తిని కూడా అరెస్ట్ చేయాల్సి ఉందని డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో సిఐ జివివి రమణ, ఎస్ఐలు యు.మహేష్, సత్యనారాయణ, ఎఎస్ఐ గోపీనాథం తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు